క్లుప్తంగా

రోడ్డెక్కిన డిపాజిట్ పంచాయితీ

వేలేరు : వదిన, మరిది పంచాయితీలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు తలదూర్చి ఇద్దరి నుంచి చెరో లక్ష డిపాజిట్‌గా తీసుకుని సమస్య పరిష్కరించకుండా ముఖం చాటేశాడు. దీంతో సదరు బాధితుడు గురువారం రోడ్డెక్కారు. ఈ సంఘటన మండలంలోని శాలపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శాలపల్లి గ్రామానికి చెందిన తూటిక మల్లమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందగా అతని భార్య రాజేశ్వరి మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో సింగరేణిలో ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు తూటిక శ్రీనివాస్ వరంగల్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా తల్లి పేరుపై ఉన్న ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమి తల్లిని ఎవరు సాకితే వారికి చెందుతుందని గతంలో గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్నారు. రాజేశ్వరి ఉద్యోగ రీత్యా మహారాష్ట్రలో ఉండటం, శ్రీనివాస్ వరంగల్‌లో ఉంటుండటంతో మల్లమ్మను కుమార్తెలు దగ్గరుంచుకుని మంచీచెడు చూస్తున్నారు. ఈ క్రమంలో భూమిని తలాకొంత వారి పేరిటా పట్టా చేసుకున్నారు. వారు కూడా కొన్ని రోజులు గడిచాక తల్లికి సేవలు చేయలేమని చెప్పి పట్టా పాసుపుస్తకాలు, తల్లి మల్లమ్మను చిన్న కుమారుడు శ్రీనివాస్ ఇంటి వద్ద వదిలివెళ్లారు. దీంతో శ్రీనివాస్ తన వదిన అయిన రాజేశ్వరికి విషయం చెప్పడంతో ఇరువురు గ్రామంలోని ఓ పెద్ద మనిషిని ఆశ్రయించారు. దీంతో సదరు పెద్దమనిషి పంచాయితీ చేయాలంటే చెరో రూ. లక్ష డిపాజిట్ పెట్టాలని మొత్తం రూ. 2 లక్షలు ముక్కుపిండి వసూలు చేసి తన దగ్గరనే పెట్టుకున్నాడు. పంచాయితీ పెట్టకపోగా రాజేశ్వరి వద్ద తీసుకున్న రూ.లక్ష డిపాజిట్ డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. కానీ శ్రీనివాస్ దగ్గర తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా ఆరు నెలలుగా ఇబ్బందులు పెడుతున్నాడని బాధితుడు తెలిపారు. అతనిపై వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడంతో పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని బాధితుడు ఆరోపించాడు. ఇప్పటికైనా అతడి నుంచి తమ డబ్బులు తమకు ఇప్పించాలని బాధితుడు అధికారులను వేడుకుంటున్నాడు.

ముగిసిన బాడిబాట



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట చేపట్టారు. ఈనెల 5 నుంచి మొదలై గురువారం వరకు నిర్వహించారు. ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రులతో సమావేశాలు, విద్యార్థుల ప్రవేశం కోసం ఇంటింటా ప్రచారం, స్థానిక విద్యాభిమానులతో సమావేశాలు, గ్రామసభలు, ర్యాలీలు, నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగత సంబురాలు నిర్వహించారు. లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం, సహిత విద్యా, బాలిక విద్య దినోత్సవ సందర్భంగా సెమినార్లతో పాటు ముగింపు రోజైన విద్యార్థులకు క్రికెట్, సాఫ్ట్ బాల్, టీం గేమ్స్‌తో పాటు ఇండోర్ గేమ్స్, ఇంటర్ హౌస్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇదే పాఠశాలలో చదివి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన బీర సతీష్ స్పోర్ట్స్ టీషర్ట్‌లను పంపిణీ చేశారు.

కల్వర్టు పూడ్చిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి



కమలాపూర్ : మండలంలోని జూజునూర్‌లో అక్రమంగా మట్టితో కల్వర్టు పూడ్చిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పూడ్చిన కల్వర్టు వద్ద గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని డ్రెయినేజీ నీరు వెళ్లే కల్వర్టును ఓ వ్యక్తి ఆక్రమించుకుని అక్రమంగా మట్టి పోసి పూడ్చి వేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో నీరంతా తమ ఇళ్లల్లోకి చేరే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మర్రిపల్లిగూడెం నుంచి జూజునూర్‌కు వెళ్లే మార్గంలో డ్రెయినేజీ నీళ్లు వెళ్లడం కోసం నిర్మించిన కల్వర్టును ఓ వ్యక్తి ఆక్రమంగా మట్టి పోసి పూడ్చి వేశాడని, దీంతో డ్రెయినేజీ నీళ్లు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చర్య తీసుకోవాలని కోరారు.

ఆర్మీ జవాన్‌కు నివాళి

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అరికిల్ల ప్రవీణ్ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా గురువారం మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ రాజమౌళి గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి నివాళులర్పించారు. ప్రవీణ్ మృతదేహంపై పూలమాల వేసి మౌనం పాటించారు.

వరుణ దేవా.. కరుణించవా

- ముఖం చాటేసిన వర్షాలు
- ఎండుతున్న మొలకలు
- ఆందోళనలో పత్తి, మొక్కజొన్న రైతులు
- వర్షాల కోసం కప్పతల్లి ఆటలు
- నష్టాల్లోకి నెట్టిన ముందస్తు వర్షాలు

ఐనవోలు : ముందస్తు వర్షాలు ఊరించి ఉసూరుమనిపించాయి. గత నెలలో కురిసిన వర్షాలకే రైతులు విత్తనాలు విత్తగా ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో మొలకలు ఎండుతుండడంతో రైతుల గుండె ఆవిరవుతోంది. చేసేదేమి లేక 'చినుకమ్మ వాన చినుకమ్మ ఒకసారి వచ్చిపోవమ్మా' అంటూ ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు.



నీరు లేక వాడిపోతున్న పంటచేనులోని మొలకలు

ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు వీస్తాయని వ్యవసాయశాఖ ప్రకటించడం, అందుకు అనుగుణంగానే రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలకు బదులు వర్షాలు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. బలమైన రోహిణి కార్తెలో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఆశతో మే చివరి వారంలో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేశారు. తీరా చూస్తే వాతావరణం మారిపోయి వానాకాలం ప్రారంభమైనా ఎండకాలాన్ని తలపిస్తుండడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

ముందస్తు వర్షాలతో రైతుల దిగాలు..

ఏప్రిల్ చివర, మే మొదటి వారంలో వానలు కురవడంతో అన్నదాతలు ఉత్సాహంగా దుక్కులు దున్ని అచ్చుతొలుకుని విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సంవత్సరం ముందుగానే నైరుతి రుతుపవనాల రాకతో మే నెలాఖరులోనే తొలకరి పలకరించింది. ఈ నేపథ్యంలో రోహిణి కార్తె ప్రారంభంలో వానలు పడటం పత్తి విత్తనాలు ఎన్నడూలేనిది మే 15 నుంచే మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో రైతులు రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. కొంత మంది మొక్కజొన్న విత్తనాలు కూడా విత్తుకున్నారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితికి వెళ్లారు. వ్యయప్రయాసలను ఓర్చి సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలు వర్షాలు లేక ఎండి పోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొక్కలను కాపాడుకునేందుకు పాట్లు

మండలంలోని వెంకటాపురం, వనమాల కనపర్తి, కొండపర్తి, ఒంటిమామిడిపల్లి, పున్నేలు, పంథిని, కక్కిరాలపల్లి, నందనం, గర్మిళ్లపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 60 నుంచి 70 శాతం రైతులు ముందుగా కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తారు. అయితే సరైన వర్ష పాతం నమోదు కాకపోవడంతో విత్తనాలు భూమిలోని అగడుకు మాడి ఎండి పోతున్నాయి. ఈ క్రమంలో సరైన మొలకశాతం రాని రైతులు మళ్లీ దుక్కి దున్ని వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాత సాగుచేద్దాం అనుకుంటున్నారు. వర్షాల కోసం వెయ్యికన్నులతో వేచి చూస్తున్నారు. మరికొందరు రైతులు మొలకెత్తిన విత్తనాలను ఎలాగైనా బతికించుకోవాలని పడరాని పాట్లు పడుతున్నారు. తమకున్న కొద్దిపాటి నీటి వనరులను రాత్రింబవళ్లు మొక్క చావకుండా కొద్దికొద్దిగా నీటి తడులు ఇస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే వర్షాలు కురువాలని ప్రసిద్ధమైన కప్పతల్లి ఆటలు ఆడుతున్నారు.

8వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండల వ్యాప్తంగా ఈ ఏడాది 11 వేల ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. అయితే గత నెలలో కురిసిన వర్షాలకు దాదాపు 7నుంచి8 వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతులు ఎకరా సాగుకు రూ. 10వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. దీంతో ఆందోళన చెందాల్సి వస్తుందని తెలిపారు.

నాలుగున్నర ఎకరాల్లో విత్తనాలు వేశాను



ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని నాలుగున్నర ఎకరాల్లో 15 ప్యాకెట్ల పత్తి విత్తనాలు వేశా. బోరు, బావుల కింద సరైన నీటి వసతి లేకపోవడంతో రెండు ఎకరాల్లో 30–40 శాతం మేరకే విత్తనం మొలకెత్తడంతో రోటావేటర్‌తో చెడగొట్టాను. మిగిలిన రెండున్నర ఎకరాల్లో మోస్తారుగా మొక్కలు ఉన్నప్పటికీ గత పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో వాడిపోతున్నాయి. వర్షం కోసం ఎదురు చూస్తున్నాను.

– కుమారస్వామి, రైతు, కక్కిరాలపల్లి

లోటు వర్షపాతం నమోదు



రోహిణి కార్తెలో విత్తనాలు నాటుకుంటే మంచిదే. మంచి దిగుబడులు కూడా వస్తాయి. కానీ విత్తనాలు విత్తుకునేందుకు అనువైన వాతావరణం ఏర్పడలేదు. కేవలం 10–15 మిల్లీ మీటర్ల అత్యల్ప వర్షం మాత్రమే నమోదు అయ్యింది. 2,3 రోజుల్లో వర్షాలు కురవకపోతే రైతులు కొంత నష్టపోయే ప్రమాదం ఉంది.

– సునీల్ కుమార్, ఏ, ఐనవోలు

పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

శాయంపేట : దేశంలోని పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ నాగపురి రాజమౌళిగౌడ్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని మైలారంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో పాల్గొని మాట్లాడారు. 11 సంవత్సరాల్లో సుపరిపాలన, పేదల సంక్షేమ మార్గంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన కొనసాగిందన్నారు. సైనికుల సాహసంతో సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. భారత్ అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు రవికిరణ్‌గౌడ్, జిల్లా, మండల, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పరకాల : మోదీ పరిపాలనలో భారతదేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. పట్టణ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సభ జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. 11 సంవత్సరాల మోదీ సుపరిపాలనలో దేశ ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, డాక్టర్ సంతోశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



పరకాల : మాట్లాడుతున్న రామచంద్రరావు

నాణ్యమైన విత్తనాలు అందించాలి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పూర్తి సబ్సిడీతో అందించాలని భూమాతా రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాసిరకం విత్తనాలు అమ్ముతున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీలేని రుణాలను అందించాలని వినతిలో పేర్కొన్నారు. అలాగే ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతుల భూములను ఉచితంగా డిజిటల్ సర్వే చేయించి హద్దులను గుర్తించి, మ్యాపింగ్ చేయించాలని కోరారు. రైతుల భూములకు రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని వినతిలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్, నాయకులు గట్టయ్య, మొగిలి, నరహరి, భగవాన్‌రెడ్డి, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నడికూడ : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలను సందర్శించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రెండు, ప్రాథమిక పాఠశాల వరణలో ఒకటి కమ్యూనిటీసోకుపిట్స్ నిర్మాణ పనులకు ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మండల కేంద్రంలోని నర్సరీని, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఎస్టిమేటెడ్ ధరల ఫ్లెక్సీని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఆదేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ రెహ్మాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో సంప్రదించాలని కోరారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు : నూతనంగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుభరోసా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోనివారు, నూతనంగా పట్టా పొందినవారు, బ్యాంకు ఖాతా మార్చుకునేవారు ఆధార్, పట్టాపాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం బస్సు సౌకర్యం కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ కందకట్ల కోటేష్ కోరారు. ఈ మేరకు గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ధర్మసాగర్ : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ధర్మపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురం గ్రామానికి చెందిన కొయ్యడ శిరీష (24) మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతురాలి తండ్రి దామర చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీపాషా తెలిపారు.

గుడుంబా రవాణా చేస్తున్న ఆటో పట్టివేత

ఆత్మకూరు : గుడుంబా రవాణా చేస్తున్న ఆటోను పట్టుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. గురువారం నల్లబెల్లి మండలం రేలకుంట నుంచి ఆత్మకూరు మండలంలోకి ఆటోలో 15లీటర్ల గుడుంబాను భూక్య సుజాత, భూక్యా జగన్ రవాణా చేస్తున్న క్రమంలో కటాక్షపూర్ వద్ద రూట్‌వాచ్‌లో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై సులోచన, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, విజయ్‌కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రంలో టైల్స్ పగిలి గుంతలు ఏర్పడడంతో విషపురుగుల సంచరిస్తున్న విషయం తెలిసిందే. కాగా సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతు పనులు ప్రారంభించారు.

పూతరాకముందే కలియదున్నాలి

ఎల్కతుర్తి : జీలుగా విత్తనాలు విత్తిన రైతులు పూత రాకముందే రెండు బస్తాలు ఎస్ఎస్‌పీ వేసి కలియదున్నుకోవాలని భీమదేవరపల్లి వ్యవసాయ అధికారిణి ఎల్.పద్మ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. కలియదున్నినట్‌లెతై భూసారం పెరుగుతుందని తెలిపారు. యూరియా శాతాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఒక ఎకరానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా, 1కిలో భాస్వరం, కిలో పొటాష్ దుక్కిలో వేసుకోవాలని, నాటు వేసే వారం రోజుల ముందు కిలో కార్బో ఫిరోన్ 3జీ గుళికలు వేసుకున్నట్‌లెతై కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చని తెలిపారు. నాటు వేసేముందు వరి కొనలను తుంచాలని తెలిపారు. రెండు నుంచి మూడు కిలోల పీఎస్‌బీని 100కిలోల పశువుల పేడ లేదా మట్టిలో కలిపి తడిగా ఉన్నప్పుడు దుక్కిలో వేసుకోవాలని, పీఎస్‌బీ సబ్సిడీలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ల్యాదెళ్లలో ఉచిత వైద్యశిబిరం

హనుమకొండ (దామెర) : దామెర మండలం ల్యాదెళ్ల గ్రామంలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తయార్‌మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, ఖలీమ్, నర్సింహచారి ఉన్నారు.

ఆదర్శ సమాఖ్యల నిర్వహణపై శిక్షణ

ఎల్కతుర్తి : మహిళా అభివృద్ధి సొసైటీ, ఏపీమాస్ (ఏపీఎంఏఎస్) సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17నుంచి 25వ తేదీ వరకు ఆదర్శ సామాఖ్యల నిర్వహణపై జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మహిళా ఆర్థిక్ వికాస్ మహామండల్ (ఎంఏవీఐఎం), హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సభ్యులు సంయుక్తంగా కలిసి భీమదేవరపల్లి మండలంలోని భరతమాత మండల సమాఖ్యను సందర్శించారు. ఈ సందర్భంగా నవచైతన్య, హర్షిత గ్రామైక్య సంఘాల పనితీరును, సంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను తెలుసుకున్నారు. సమాఖ్యల నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీడీ వెంకటేశ్వర్లు, డీపీఎం అనిల్‌కుమార్, ఏపీఎం దేవానంద్, కోటేశ్వర్, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ నారాయణ పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిసినట్లు తెలిపారు. రైతుల నుంచి 333 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎమ్మార్ఐ రమేశ్‌ఖన్నా, ఏఎస్ఓ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది విజయ్, శశికాంత్, తులసి, మోహన్, సంపత్, రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐనవోలు : భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిశాయి. ఇప్పటి వరకు వివిధ అంశాలపై 3,012 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సైతం తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

భూ భారతి దరఖాస్తు గడువు పెంచాలి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పథకం దరఖాస్తు గడువును పెంచాలని బహుజన సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు క్రాంతికుమార్‌తో పాటు తదితరులు అందించినవారిలో ఉన్నారు.

బడుగుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్

కమలాపూర్ : రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. ఖాసీంపల్లిలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గురువారం పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోశారు. అనంతరం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న దేశరాజుపల్లిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నిర్మాణం ఎలా జరుగుతోందని, సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నారా..? అని తెలుసుకున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు చూశామని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇళ్లు నిర్మించుకుంటున్నామని లబ్ధిదారులు ప్రణవ్‌తో చెబుతూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి మంత్రిగా, ఎమ్మెల్సీగా పనిచేసిన వారెవరూ నిరుపేదల సంక్షేమానికి ఏమీ చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణి, డైరెక్టర్లు కృష్ణ, కృష్ణమూర్తి, నాయకులు రమేశ్‌గౌడ్, చరణ్‌పటేల్, శ్రీనివాసరావు, రమేశ్, వంశీధర్‌రావు, కనుకరత్నం, పర్శరాములుగౌడ్, శ్రీకాంత్, సుభాష్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ప్రణవ్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



క్రీడల్లో విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ రాజేష్‌కుమార్

హనుమకొండ (దామెర) : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని దామెర ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ సూచించారు. దామెర మండలంలోని ఊరుగొండ హైస్కూల్‌లో గురువారం బడిబాట ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు క్రీడలు, అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. కమ్యూనిటీ మొబిలైజర్ సుదర్శన్‌రెడ్డి, హెచ్‌ఎం సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్ : ఎంపీడీఓ

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.1000 చొప్పున పారితోషికం అందజేత

పరకాల : చదువుతోనే మంచి భవిష్యత్ ఏర్పడుతుందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఒక్కో విద్యార్థికి వెయ్యి రూపాయల చొప్పున పారితోషికం అందజేసి అభినందించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ వర్షిత(557), జెడ్పీహెచ్ఎస్ నాగారం విద్యార్థి విఘ్నేష్ (530), పరకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్. అజయ్(455), జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రవితేజ(453)కు రూ.1000 నగదు ప్రోత్సాహం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమాదేవి, మండల నోడల్ అధికారి సాంబయ్య, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం మధు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఆంజనేయులు

క్రీడలతో మానసికోల్లాసం : ఎంఈఓ



ఎంఈఓ భిక్షపతిని మార్చ్‌ఫాస్ట్‌తో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

శాయంపేట : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంఈఓ భిక్షపతి అన్నారు. గురువారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓ హాజరుకాగా మార్చ్‌ఫాస్ట్‌తో విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామం చేస్తూ ప్రతి విద్యార్థి పాల్గొనేలా చూడాలన్నారు. క్రీడలు ప్రతి విద్యార్థి జీవితంలో తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సారయ్య, పంచాయతీ కార్యదర్శి సునీల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అన్న వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మండలస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ ఈనెల 21 నుంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ భిక్షపతి తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి మూడో తరగతి పూర్తిచేసి నాల్గోవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9848506098, 9912796596 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రాహుల్ గాంధీ సేవలు దేశానికి అవసరం

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సేవలు భారత దేశానికి అవసరమని కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కమలాపూర్, ఎల్కతుర్తి, ఆత్మకూరు, ధర్మసాగర్‌తో పాటు వివిధ మండలాల్లో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. పలుచోట్లు రక్తదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న ప్రణవ్



ఐనవోలు : మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఆత్మకూరు : రక్తదానం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



ధర్మసాగర్‌లో..

చార్జర్ లేదన్నందుకు టీప్యాలెస్‌పై దాడి

పరకాల : సెల్‌ఫోన్ చార్జర్ లేదన్నందుకు బస్టాండ్ కూడలిలోని రాజధాని టీప్యాలెస్‌పై ఓ వ్యక్తిదాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. దాడిలో టీప్యాలెస్ అద్దాలు ధ్వంసం కావడంతో యాజమాని రామన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.